# యువ క్రీడాకారుల భవిష్యత్తుకు కార్పొరేట్ అండ అవసరం

ఆర్థిక అంతరాలు తొలగించి కెరీర్ భద్రత కల్పించాలి

టీజీ20 విజేత 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' జట్టుకు ఘన సన్మానం

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వరినాథ్



విశ్వంభర, హైదరాబాద్: దేశంలో ప్రతిభావంతులైన యువ క్రికెటర్ల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు కార్పొరేట్ సంస్థలు మరింత ముందుకు రావాలని మాజీ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కెప్టెన్, బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వరినాథ్ అన్నారు. యువ క్రీడాకారుల మధ్య ఉన్న ఆర్థిక అంతరాలను పూడ్చడంతో పాటు ప్రాథమిక స్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులకు నమ్మకమైన కెరీర్ భద్రతా వలయాలు అందించేలా కార్పొరేట్ సంస్థలు కృషి చేయాలని కోరారు. బీసీసీఐ సహకారంతో తెలంగాణలో తొలిసారిగా నిర్వహించిన టీజీ20--2026 క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' జట్టుకు శనివారం హైదరాబాద్ లోని తాజ్ డెక్కన్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. టోర్నమెంట్‌లో 11 మ్యాచ్‌లు ఆడి 10 విజయాలు సాధించి టైటిల్ కైవసం చేసుకున్న జట్టు సభ్యులను ట్రూజన్ సోలార్ సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టుకు ట్రూజన్ సోలార్ సంస్థ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

**గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికితీయాలి**

ఈ సందర్భంగా వి. చాముండేశ్వరినాథ్ మాట్లాడుతూ టీజీ20 టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టు ఆటగాళ్లకు అభినందనలు తెలిపారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి సరైన అవకాశాలు కల్పించడం ద్వారా దేశంలో క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల అభివృద్ధికి కూడా ట్రూజన్ సోలార్ సంస్థ కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ తదితరులు ట్రూజన్ సోలార్ సంస్థలో పెట్టుబడిదారులుగా ఉన్నారని తెలిపారు. కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా భవిష్యత్తులో ఇతర క్రీడలను కూడా ప్రోత్సహించేందుకు ట్రూజన్ సోలార్ సంస్థ ఆసక్తి చూపుతోందని చెప్పారు. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టుకు మరో మూడేళ్ల పాటు స్పాన్సర్‌షిప్‌ను కొనసాగించాలని సంస్థ నిర్ణయించిందని వెల్లడించారు. ట్రూజన్ సోలార్ పవర్ మేనేజింగ్ డైరెక్టర్ చారుగుండ్ల భవాని సురేష్ మాట్లాడుతూ, "మీరు ఆడారు.. గెలిచారు.. ఛాంపియన్లుగా నిలిచారు. ఈ వేడుక మీ కోసమే" అంటూ విజేత జట్టు సభ్యులను అభినందించారు. క్రికెట్ అభివృద్ధికి తమ సంస్థ ఇప్పటికే మద్దతు అందిస్తోందని, భవిష్యత్తులో క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. తెలంగాణతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభ కనబరుస్తున్న యువ క్రీడాకారులను గుర్తించి, వారి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు. క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో ఉన్న ప్రతిభావంతులైన యువత తమను సంప్రదిస్తే సాధ్యమైనంత మేరకు అండగా నిలుస్తామని భవాని సురేష్ తెలిపారు. తెలంగాణతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని యువ క్రీడా ప్రతిభకు మరిన్ని అవకాశాలు కల్పించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

**మరో మూడేళ్లు హైదరాబాద్ జట్టుకు స్పాన్సర్‌షిప్**

యువ క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నదే తమ లక్ష్యమని ట్రూజన్ సోలార్ ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టుతో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూ మరో మూడేళ్ల పాటు స్పాన్సర్‌షిప్ అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వరినాథ్, ట్రూజన్ సోలార్ పవర్ మేనేజింగ్ డైరెక్టర్ చారుగుండ్ల భవాని సురేష్, సీఈఓ జక్కుల శ్రీనివాస్, హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ కెప్టెన్ అభిజిత్ రెడ్డి, వైస్ కెప్టెన్ అజయ్ దేవ్ గౌడ్‌తో పాటు జట్టు సభ్యులు, ట్రూజన్ సోలార్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ సృష్టించిన కరువే

: మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



విశ్వంభర, సూర్యాపేట : రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆరోపించారు. కాలమో, ఎల్‌నినో తో వచ్చిన కరువు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ సృష్టించిన కరువే నని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ప్రభుత్వానికి దున్నపోతుపై వాన పడ్డట్టుందని ఆరోపించారు. పాము తన పిల్లలను తానే చంపుకున్నట్లు.. కాంగ్రెస్ తెలంగాణ రైతాంగాన్ని చంపుతుందని విమర్శించారు. కృష్ణా, గోదావరి నీళ్లు ఎట్లా పోతున్నాయో కేటీఆర్, తాము కళ్లకు కట్టినట్లు చూపించినం. సుందిళ్ల, అన్నారం బ్యారేజులు మంచిగున్నాయని సెంట్రల్ వాటర్ కమిషనే స్పష్టంగా తెల్చింది. 75 రోజుల్లో గోదావరిలో 150 టీఎంసీ నీళ్లను వృధాగా సముద్రం పాలు చేశారని మండిపడ్డారు. కృష్ణాలో 150 టీఎంసీల నీటిని ఆంధ్రా పాలు చేశారని ఆరోపించారు. ఆంధ్ర సీఎం అనధికార ఉత్తరులతో అక్రమంగా నీళ్లను దోచుకు పోయారని విమర్శిం చారు. వంద శాతం రేవంత్ రెడ్డి అనుమతితోనే జరుగుతుందని పేర్కొన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడితోనే సాగర్ గేట్లు కొంతమేరా వదిలిపెట్టారని వివరించారు. కుడికాలువకు నీళ్లిచ్చి ,ఎడమ కాలువకు ఎందుకు ఇస్తలేరని మంత్రులకు అడిగే సోయికూడా లేదని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రైతాంగానికి న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, నియోజకవర్గం ముఖ్య నేతలు, ప్రజాప్రతి నిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఎంఐఎం ఎమ్మెల్సీ రహ్మత్‌బేగ్‌పై వేటు

పదవికి రాజీనామా చేయాలని ఆదేశం

వీడియో లీక్ వ్యవహారమే వేటుకు కారణమా?



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌పై ఆ పార్టీ అధిష్టానం కఠిన చర్యలు తీసుకున్నది. ఆయనను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. ఎమ్మెల్సీ పదవికి కూడా వెంటనే రాజీనామా చేసి, ఆ లేఖను శాసనమండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎంఐఎం సంయుక్త కార్యదర్శి ఎస్ఏ హుస్సేన్ అన్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే రహ్మత్ బేగ్‌పై చర్యలకు దారితీసిన పూర్తి కారణాలను పార్టీ తన ప్రకటనలో వెల్లడించలేదు. మీర్జా రహ్మత్ బేగ్ 2023లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2029 మే వరకు కొనసాగాల్సి ఉన్నది.

అయితే పార్టీ తాజాగా నిర్ణయంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ ఆదేశాల మేరకు రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్‌కు సమర్పించిన తర్వాతే ఆయన ఎమ్మెల్సీ పదవిపై తదుపరి ప్రక్రియ ప్రారంభం కానున్నది. అయితే, రాజీనామా చేసేందుకు రహ్మత్ బేగ్ ససేమిరా అంటున్నట్టు తెలుస్తున్నది. ఇటీవల వెలుగులోకి వచ్చిన వీడియో లీక్ వ్యవహారమే రహ్మత్ బేగ్‌పై పార్టీ చర్యలకు కారణమని ప్రచారం జరుగుతున్నది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వివిధ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు.

ఈ నేపథ్యంలో పార్టీ అకస్మాత్తుగా బహిష్కరణ వేటు వేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నది. మరోవైపు, ఇటీవల తనపై డీప్ ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు బయటపెడతామంటూ కొందరు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరిస్తున్నారని రహ్మత్ బేగ్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు వార్తలు వచ్చాయి. రహ్మత్ బేగ్ వ్యవహారంలో సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోలు, ఆయన గతంలో చేసిన సైబర్ క్రైమ్ ఫిర్యాదు.. ఈ పరిణామాల మధ్య ఎంఐఎం అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే బహిష్కరణకు కచ్చితమైన కారణాన్ని పార్టీ అధికారికంగా వెల్లడించకపోవడంతో ఈ వ్యవహారంపై స్పష్టత రావాలంటే ఎంఐఎం నుంచి మరింత వివరణ రావాల్సి ఉన్నది. అదే సమయంలో వైరల్ అవుతున్న వీడియోలు, వాటికి సంబంధించిన ఆరోపణల నిజానిజాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉన్నది.

# జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడేళ్ల చిన్నారి మృతి

వైద్యుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం



విశ్వంభర, నారాయణపేట : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడేళ్ల చిన్నారి మృతి కలకలం రేపింది. నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకట్రాములు కుమార్తె చైత్ర (7) రెండు రోజులుగా జ్వరం తో బాధ పడుతుందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చిన్నారి పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. దాదాపు ఐదు గంటల పాటు వైద్యం కోసం ఎదురుచూసినా సరైన స్పందన లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. చిన్నారి పరిస్థితి మరింత విషమించడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కిడ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడ కూడా సరైన వైద్యం అందలేదని పేర్కొన్నారు. తిరిగి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా 15 నుంచి 20 నిమిషాల్లోనే చిన్నారి మృతి చెందిందిదని వివరించారు. డాక్టర్లు కనీసం ముట్టుకుని కూడా చూడలేదని విలపించారు. చిన్నారికి సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే మృతి చెందిందని ఆరోపించారు. పేషెంట్ బెడ్ వద్ద ఎవరూ కనిపించలేదని డాక్టర్ తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తాము తెల్లవారుజామున 4 గంటలకే ఆస్పత్రికి వచ్చి ఉదయం 9 గంటల వరకు అక్కడే ఉన్నామని బాలిక తల్లిదండ్రులు వివరించారు. ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి మృతి చెందే వరకు జరిగిన పరిణామాలను పూర్తిగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే చిన్నారి మృతికి అసలు కారణాన్ని స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



విశ్వంభర, నర్సాపూర్ : ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకే సెప్టెంబర్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడతున్నట్లు బీఆర్ఎస్ మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిరసన కార్యక్రమాల విజయవంతంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు , 420 హామీలతో గద్దెనెక్కి వాటిని విస్మరించారని ఆరోపించారు. చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల కు వచ్చిన తర్వాత ఉద్యోగస్తులతోపాటు రిటైర్మెంట్ ఎంప్లాయిస్ ను ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు మాట మార్చిందని అన్నారు. ప్రజలను డైవర్షన్ చేసి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావును తిట్టడమే సీఎం రేవంత్ లక్ష్యంగా పెట్టుకున్నాడని అన్నారు. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ పెందుర్తి నుంచి శెట్టిపల్లి వరకు రోడ్డు కోసం రూ.18 కోట్లు రీ బిటి కోసం మంజూరు చేస్తే తండాలను పిలిచి అగ్రిమెంట్ చేసి, నేడు పనులను నిలిపివేసినట్లు ఆరోపించారు. రోడ్డు నిర్మించాలని కోరుతూ ఈనెల 31 న వెల్దుర్తి నుంచి శెట్పల్లి వరకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒక్కొక్క దివ్యాంగునికి రూ.66 వేలు బాకీ పడ్డవ్ రేవంత్ : హరీశ రావు



విశ్వంభర, హైదరాబాద్: దివ్యాంగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేసినవా..? రేవంత్ రెడ్డి అని నేను అడుగుతున్నా. అమలు చేస్తే అదేందో ఒకటి చెప్పు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అడిగారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో హస్తినాపురంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా, దివ్యాంగుల హక్కుల సాధనకై నిర్వహించిన 'సమర శంఖారావం'లో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నువ్వు ఉచిత బస్సు అన్నవ్.. 6 వేల రూపాయల పెన్షన్ అన్నవ్.. మోసం చేసినవ్.. స్థానిక సంస్థల రిజర్వేషన్లు కల్పిస్తా అన్నవ్.. దగా చేసినవ్. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తా అని.. ఇవాళ్టికి ఒక్క పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. దివ్యాంగులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయకుండా దగా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి మెల్లగా ఎగ్గొడతా.. చివరకు ఎన్నికలకు 6 నెలల ముందు ఇస్తా అనుకుంటున్నడు.. అంటే ఆయనకే తెలివి ఉందా.. మనకు లేదా..? అని హరీశ్ రావు అన్నారు. రేవంత్ రెడ్డి నీ ప్రభుత్వం వచ్చి 33 నెలలు అయింది.. నువ్వు నిజంగా ఒక్కొక్కరి రూ.6 వేల చొప్పున లెక్కపెడితే ఈ రాష్ట్రంలోని 5 లక్షల 11 వేల దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.66 వేలు బాకీ పడ్డవ్ బిడ్డా అని హరీశ్ రావు హెచ్చరించారు. ఆ 66 రూపాయలు ఇచ్చినంకనే లెక్క.. లేకుంటే అప్పటిదాకా నువ్వేం చేసినా దివ్యాంగులు నిన్ను నమ్మరు కాక నమ్మరు. నువ్వు ఎన్నికలు దగ్గర పడ్డంక మెల్లగా ఇస్తే మరిచిపోతరనుకుంటున్నవా..? 6 నెలల ముందు ఇస్తా.. 3 నెలల ముందు ఇస్తా.. మరిచిపోతరనుకుంటుండు రేవంత్ రెడ్డి. పైసల్లేకనా.. పైసల్లేక కాదు.. రేవంత్ రెడ్డి మనసు లేక దివ్యాంగులను మోసం చేస్తా ఉన్నడు. రేవంత్ రెడ్డి దగ్గర అందాల పోటీ పెట్టేందుకు వేల కోట్లు ఉంటయి. నీ ఫుట్ బాల్ సోకులు తీర్చుకునేందుకు వందల కోట్లు ఖర్చు పెడతవ్ రేవంత్ రెడ్డి. ఫ్యూచర్ సిటీకి లక్ష కోట్లు పెడతవ్. మూసీ సుందరీకరణకు లక్ష కోట్లు ఖర్చుపెట్టేందుకు నీ దగ్గర దేశంలో ఎక్కడ ఎన్నికలొచ్చినా రేవంత్ రెడ్డి బొమ్మలేసుకుని పత్రికల్లో, టీవీల్లో ప్రచారం చేసుకునేందుకు వందల కోట్లు ఖర్చు పెట్టేందుకు నీ దగ్గర డబ్బులుంటయి. బడా బడా కాంట్రాక్టర్లకు వేల వేల కోట్లు కమీషన్ల బిల్లులు ఇచ్చేందుకు నీదగ్గర డబ్బులుంటయని ఫైర్ అయ్యారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం

విశ్వంభర, ధర్మారం: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 2 కె -రన్ పోటీలను నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు పరుగు పందెం నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు క్లబ్ తరపున బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చింతపండు నర్సింగం, డిస్ట్రిక్ట్ మైక్రో క్యాబినెట్ సభ్యులు సామ ఎల్లారెడ్డి, తన్నీరు రాజేందర్, డాక్టర్ కామన్ శ్రీనివాస్, మునీందర్ రెడ్డి, క్లబ్ ప్రధాన కార్యదర్శి కట్ట రమేష్, కోశాధికారి కడారి కుమార్, జెడ్ సి తలమక్కి రవీందర్ శెట్టి, సభ్యులు గడ్డం లింగారెడ్డి,ఇప్ప మల్లేష్, ,అక్కెనపల్లి చంద్రయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లి స్వామి, సభ్యులు దాగేటి కొమురయ్య,పీఎస్ రైటర్ సుందర్ సింగ్, నరేందర్, మోడల్ స్కూల్ పిఈటి బైకని కొమురయ్య, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి అసభ్య పదజాలంపై ఎథిక్స్ కమిటీ చర్చించాలి : ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



విశ్వంభర, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడుతున్న అసభ్య పదజాలంపై ఎథిక్స్ కమిటీ లో కూడా చర్చించాలని మాజీ మంత్రి ,ఎథిక్స్ అసెంబ్లీ కమిటీ సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ వద్ద మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో మాట్లాడారు. ఎథిక్స్ కమిటీ సమావేశంలో బీఆర్ఎస్ వాదనను బలంగా వినిపించామని వెల్లడించారు. పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల పై వివాదం జరిగిన రోజు 23 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో అసెంబ్లీ లో మాట్లాడించారు. అది మూడ్ ఆఫ్ ది హౌజ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ సభ్యుల మాటల ఆధారం గా పాడి కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఎజెండాగా చేర్చారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి అసభ్య పదజాలం పై ఎథిక్స్ కమిటీ చర్చించాలని అసెంబ్లీ చైర్మన్‌ను కోరామని తెలిపారు. రేవంత్ రెడ్డి ,పొన్నం ప్రభాకర్ ,దానం నాగేందర్ , వీర్లపల్లి శంకర్ , మందుల శామ్యూల్స్ సభలో అనుచితంగా మాట్లాడటం , ప్రవర్తించడంపై ఎథిక్స్ కమిటీకి రాత పూర్వకంగా పిర్యాదు చేశామని, వారు మాట్లాడిన వీడియోలు ఆధారంగా సమర్పించామని వివరించారు. తమ విజ్ఞప్తి పై నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డికి సమాధానం చెప్పుకునే అవకాశం ఇవ్వాలని కోరామని తెలిపారు. బీజేపీ , బీఆర్ఎస్‌లు సహకరించు కుంటున్నాయన్న ఎథిక్స్ కమిటీ కాంగ్రెస్ సభ్యుడి ఆరోపణలో నిజం లేదని కొట్టిపారేశారు.

కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గత ప్రభుత్వ అన్ని పథకాలు కొనసాగుతున్నాయనడంలో నిజం లేదని స్పష్టం చేశారు. రైతు బీమాకు ప్రీమియం కట్టకపోవడంతో దానిని నిలిపివేశారని ఆరోపించారు. కొండసురేఖ వ్యవహారంపై ఏం జరుగుతుందో తెలియదు..రాజకీయాల్లో ఏదైనా సాధ్యమేనని అన్నారు.

# అమెరికన్ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న అభినవ సంతోష్



విశ్వంభర, తాండూర్ : తాండూర్ మండల కేంద్రానికి చెందిన అభినవ కల్చరల్ సోషల్, స్పోర్ట్స్ ,ఎడ్యుకేషనల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశెట్టి సంతోష్ కుమార్ అంతర్జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం పుదుచ్చేరిలోని కంబన్ కలైరంగం ఆడిటోరియంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కే వెంకటేశన్ అధ్యక్షతన 'సామాజిక నాయకులు, దార్శనికుల సమ్మేళనం -2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సంతోష్ కుమార్ 30 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించడం వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. సంతోష్ కు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.